



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
29-05-2025
పేజీలు: 02










## 14 ఏళ్ల తర్వాత గద్దర్ అవార్డుల ప్రకటన

తెలుగు రాష్ట్రాలలో 14 ఏళ్ల తర్వాత సినీ పురస్కారాల సంబురం నెలకొంది. తెలుగు చలనచిత్ర పరిశ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దివంగత ప్రజా గాయకుడు గద్దర్ పేరిట అవార్డులని అందించనుంది. ఇప్పటికే విధి విధానాలని ప్రకటించిన ప్రభుత్వం కొద్ది నిమిషాల క్రితం అవార్డులని ప్రకటించింది. ఈ గద్దర్ అవార్డుల జ్యూరీగా సీనియర్ నటి జయసుధను నియమించింది. మార్చి 13 నుంటి అవార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించి ఈరోజు ఉదయం అవార్డులను ప్రకటించింది. తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో కలిసి అవార్డుల జాబితాను ప్రకటించారు.2014 నుంచి 2023 వరకు ఒక్కో సంవత్సరానికి గాను ఉత్తమ చలన చిత్రానికి గద్దర్ అవార్డును ప్రకటించారు. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ మొదటి చిత్రం కల్కి, ఉత్తమ రెండో సినిమాగా పొట్టేల్, ఉత్తమ మూడో సినిమగా లక్కీ భాస్కర్ చిత్రాలను అవార్డులను ప్రకటించారు.

### గద్దర్ అవార్డుల జాబితా చూస్తే..

బెస్ట్ ఫీచర్ : కల్కి, పొట్టేల్, లక్కీ భాస్కర్
ఉత్తమ సామాజిక చిత్రం : కమిటీ కుర్రోళ్లు
ఉత్తమ బాలల చిత్రం : 35 చిన్నకథ కాదు
ఉత్తమ హెరిటేజ్ ఫిల్మ్ : రజాకార్
ఉత్తమ నూతన దర్శకుడు : ఎదు వంశీ
హోల్ సమ్ ఎంటర్టైన్మెంట్ : ఆయ్
ఉత్తమ దర్శకుడు : నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ నటుడు : అల్లు అర్జున్ (పుష్ప 2)
ఉత్తమ నటి : నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
బెస్ట్ సపోర్టింగ్ నటుడు : ఎస్ జే సూర్య (సరిపోదా శనివారం)
బెస్ట్ సపోర్టింగ్ నటి : అంబాజీపేట ఫేమ్ శరణ్య
మ్యూజిక్ : భీమ్స్ (రజాకార్)
బెస్ట్ సింగర్ : సిధ్ శ్రీరామ్ (ఊరు పేరు భైరవకోన)
బెస్ట్ సింగర్ (ఫీమేల్) : శ్రేయా ఘోషాల్ (పుష్ప 2)
బెస్ట్ కమెడియన్స్ : వెన్నెల కిషోర్, సత్య
ఉత్తమ బాల నటులు : అరుణ్ దేవ్ (35 చిన్న కథ కాదు), హారిక (మెర్సీ కిల్లింగ్)
ఉత్తమ రచయిత : శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)
బెస్ట్ స్క్రీన్ ప్లే రైటర్ : వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ పాటల రచయిత : చంద్రబోస్ (రాజు యాదవ్)
బెస్ట్ సినిమాటోగ్రఫర్ : విశ్వనాథ్ రెడ్డి (గామీ)
బెస్ట్ ఎడిటర్ : నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
బెస్ట్ ఆడియోగ్రాఫర్ : అరవింద్ మీనన్ (గామీ)
బెస్ట్ కొరియోగ్రాఫర్ : గణేష్ ఆచార్య (దేవర ఆయుధ పూజ)
బెస్ట్ ఆర్ట్ డైరెక్టర్ : అద్నితిన్ జిహానీ చౌదరి (కల్కి)
బెస్ట్ యాక్షన్ కొరియోగ్రాఫర్ : చంద్ర శేఖర్ రాథోడ్ (గ్యాంగ్ స్టర్)
బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్ : నల్ల శీను(రజాకార్)
బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ : అర్చన రావు, అజయ్ కుమార్ (కల్కి)
స్పెషల్ జ్యూరీ అవార్డు(హీరో) : దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
స్పెషల్ జ్యూరీ అవార్డు (హీరోయిన్) : అనన్య నాగళ్ళ (పొట్టెల్)
స్పెషల్ జ్యూరీ అవార్డు (డైరెక్టర్) : సుజీత్, సందీప్ (క)
స్పెషల్ జ్యూరీ అవార్డు (నిర్మాత) : ప్రశాంతి రెడ్డి, రాజేష్ కళ్లేపల్లి (రాజు యాదవ్)
జ్యూరీ స్పెషల్ మెన్షన్ (సింగర్) : ఫరియా అబ్దుల్లా (ర్యాప్ సాంగ్ - మత్తు వదలరా)

చిన్న చిత్రాలు, పెద్ద సినిమాలు, స్టార్ హీరోలు, కొత్త హీరోలు, కొత్త దర్శకులు అన్న తేడా లేకుండా అందరికీ సమన్యాయం అన్నట్టుగా ఈ అవార్డుల్ని ప్రకటించినట్టుగా కనిపిస్తోంది. మరి ఈ అవార్డులపై టాలీవుడ్ ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి. ఇక ఈ అవార్డుల కోసం మొత్తం 1248 నామినేషన్లు వచ్చాయి. 11 కేటగిరీల్లో అవార్డుల్ని వెల్లడించారు. 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ 31 వరకు వచ్చిన చిత్రాల్లో ఒక సినిమాను ఉత్తమ చిత్రంగా ప్రకటించారు. 2024 ఏడాదిలో రిలీజ్ అయిన అన్ని చిత్రాలకు అన్ని కేటగిరీల్లో అవార్డుల్ని ప్రకటించారు.

## కేటీఆర్‌పై విరుచుకుపడ్డ కవిత..

# నాతో పెట్టుకోవద్దు

### ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు


ఎమ్మెల్సీ కవిత మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలపాలని చూస్తున్నారని సంచలన కామెంట్స్ చేశారు. బీజేపీలో పార్టీని విలీనం చేయవద్దని చెప్పానని తెలిపారు. తనకు నీతులు చెబుతున్న బీఆర్ఎస్ నేతలు.. తెలంగాణ కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. కేసీఆర్ నీడలో పని చేస్తున్న వాళ్లు.. తనపై ప్రతాపం చూపిస్తున్నారని విమర్శించారు. తనకు వెన్నుపోటు రాజకీయాలు చేయడం రాదన్నారు. పార్టీని బలోపేతం చేసే తీరు ఇదేనా అని కవిత ప్రశ్నించారు. తాను రాసిన లేఖను బయట పెట్టింది ఎవరో తేల్చాలన్నారు. కేసీఆర్‌లానే తాను ఎవరికి భయపడేది లేదని కవిత తేల్చి చెప్పారు. "నాకు నీతులు చెబుతున్న బీఆర్ఎస్ వాళ్లు తెలంగాణకు జరుగుతుననా అన్యాయంపై ఫైట్ చేయాలి. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తుంటే ఎవరు స్పందించారు..? నా మీద పడి ఏడిస్తే ఏం లాభం. లేఖల లీకులు చేస్తున్న వారిపై చర్యలు లేవు. నాపై లిక్కర్ కేసు అంశం వచ్చినప్పుడు.. నేను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని కేసీఆర్ దగరికి వెళ్లాను. కానీ నాన్న అవసరం లేదు అన్నాడు. అందుకే కంటిన్యూ అయ్యా. ఎంపీగా పోటీ చేసినప్పుడు నాపై కొందరు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఓడిపోయినా జాగృతిని సొంత డబ్బుతో నడిపిస్తున్నా.. వాళ్ల డబ్బులు తీసుకోలేదు. నన్ను విమర్శించేవాళ్లు కొందరు పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తున్నారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే ఎక్కడ పోయారు..? ఎవరు ఆందోళన చేయడం లేదు. లీక్ వీరులను బయట పెట్టకుండా గ్రీక్ వీరుల్లాగా ఎగిరిపడుతున్నారు. నేను వందల లెటర్స్ రాశా.. అందులో తప్పేముంది..? తెలంగాణ సోయితో పనిచేయడం లేదు? కొందరు కేసీఆర్ కింద ఉన్నవాళ్లు సరిగ్గా పనిచేయడం లేదు. స్వంత బిడ్డపై మీ ప్రతాపం ఏంటి..? బయట వాళ్లపై ఎందుకు మాట్లాడటం లేదు. ఇదేనా పార్టీని నడిపించడం..? సభను సక్సెస్ చేసింది కేసీఆర్ మాత్రమే.. ప్రతిదీ ఆయనే చూసుకున్నారు. గంపగుత్తగా బీజేపీకి అంట గట్టేలాగా వ్యవహారం చేస్తున్నారు. బీజేపీ కోవర్టులు మనదాంట్లో ఎవరు ఉనారు..? నేను పదవి అడగలేదు. పైసలు అడగలేదు. వెన్నుపోటు రాజకీయం చేయను. చేయలేదు. కాంగ్రెస్ బాగుంటే రాహుల్ బాగుంటే బీజేపీ ఇన్నిసార్లు గెలవదు. వాళ్ల పరిస్థితినే బాగా లేదు. వర్కింగ్ ప్రసిడెంట్ వ్యతిరేకంగా పోవడం లేదు. ఆయన పోస్ట్‌కు ఉండే గౌరవం ఉంటుంది. మాకు కేసీఆర్ తప్ప మరో లీడర్ లేడు." అంటూ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

### నాపై పడి ఏడుస్తున్నారు..

బీజేపీ నేతలకు చెందిన హాస్పిటల్స్ ప్రారంభోత్సవాలకు వెళ్ళింది ఎవరో అందరకీ తెలుసునంటూ పార్టీలోని అగ్రనేతలను ఆమె పరోక్షంగా విమర్శించారు. తన లేఖ లీక్ చేసిందెవరు తేల్చమంటే.. తనపై పడి ఏడుస్తున్నారంటూ మండిపడ్డారు. పదవులు కోరినట్లు తనపై పత్రికల్లో తప్పుడు వార్తలు రాయించారన్నారు. కేసీఆర్ లెక్క.. తాను చాలా తిక్కదానినని ఆమె పునరుద్ఘాటించారు. వెన్నుపోటు రాజకీయాలు తను రావని.. సూటిగా మాట్లాడుతానని కుండ బద్దలు కొట్టారు. సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాడుతానన్నారు. మా వాళ్ళు కొందరు.. సోషల్ మీడియాలో మహాభారతం క్యారెక్టర్లు వేస్తున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. వారు స్థాయికి మించి ఊహించుకుంటున్నారంటూ ఎద్దేవా చేశారు. వరంగల్ సభ తమ వలనే సక్సెస్ అయిందని కొందరు ఊహించుకుంటున్నారన్నారు. కేసీఆర్‌ను మోసేంత పెద్ద వాళ్ళు అయిపోయామని వారంతా భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జైలు వెళ్ళేటప్పుడు పార్టీకి, పదవికి రాజీనామా చేస్తానంటే కేసీఆర్ వద్దన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ వద్దంటేనే తాను ఈ పదవిలో కొనసాగుతున్నానన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిజామాబాద్ ఎంపీగా తనను ఓడించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



## పూర్తికావస్తున్న సంబరాల యేటిగట్టు



హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ఎమోషనల్ యాక్షన్ డ్రామా 'సంబరాల యేటిగట్టు'(SYG). రోహిత్ కెపి దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం 120 రోజుల షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. దీంతో దాదాపు 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మిగిలిన కీలక సన్నివేశాల కోసం ప్రస్తుతం మూడు భారీ సెట్‌లను నిర్మిస్తున్నారు. నెక్స్ట్ షెడ్యూల్ ఈ సెట్స్‌లోనే జరుగనున్నది. అద్భుతమైన విజువల్స్, ఉత్కంఠను కలిగించే భారీ పోరాట సన్నివేశాలు ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నట్టు మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటివరకూ చేయని మోస్ట్ పవర్‌ఫుల్ పాత్రను సాయిదుర్గతేజ్ చేస్తున్నారని, ఈ పాత్రకోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారని, త్వరలోనే ఈ సినిమాలో నటించే ఇతర నటీనటుల వివరాలు వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

# ఐపీఎల్‌లో నేడు బిగ్ ఫైట్

### పంజాబ్‌తో బెంగళూరు ఢీ

ఐపీఎల్ తుది అంకానికి సమయం ఆసన్నమైంది. దశాబ్దం తర్వాత ప్లేఆఫ్స్‌కు చేరిన జోష్‌లో ఉన్న పంజాబ్ కింగ్స్‌కు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) రూపంలో అసలుసిసలు సవాల్ ఎదురుకానుంది. ఈ మెగా లీగ్‌లో సమవుజ్జీలుగా కనిపిస్తున్న పంజాబ్, బెంగళూరు జట్లు గురువారం జరిగే క్వాలిఫయర్-1లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇందులో నెగ్గిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకోనుండగా.. ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2 రూపంలో మరో అవకాశం ఉంటుంది. లీగ్ దశలో ఆడిన 14 మ్యాచ్‌ల్లో చెరో 9 విజయాలతో పంజాబ్, బెంగళూరు 19 పాయింట్లతో సమంగా నిలిచాయి. అయితే, మెరుగైన రన్‌రేట్‌తో పంజాబ్ టాప్‌లో నిలిచింది. 2014లో చివరిసారి నాకౌట్ చేరిన పంజాబ్.. ఈసారి అందరి అంచనాలను తారుమారు చేస్తూ అనూహ్యంగా టాప్‌లో నిలిచింది. జట్టును ఈస్థాయిలో నిలపడంలో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, కోచ్ రికీ పాంటింగ్ కృష్టి ఎంతో ఉంది.ఇక, ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ అదిరే ఆరంభాన్నిస్తుంటే.. ఇంగ్లిస్, అయ్యర్, నేహల్ వధేరా మిడిలార్డర్‌లో వెన్నెముకగా నిలుస్తున్నారు. శశాంక్ సింగ్, స్టొయినిస్ ఫినిషర్లుగా అదరగొడుతున్నారు. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, హర్‌ప్రీత్ బ్రార్ అండగా నిలుస్తున్నారు. దక్షిణాఫ్రికా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్ స్వదేశానికి తిరిగివెళ్లడంతో అతడి స్థానంలో ఒమర్జాయ్‌కు తుదిజట్టులో చోటు దక్కొచ్చు. గాయం నుంచి కోలుకున్న లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ ఈ మ్యాచ్‌లో ఆడే చాన్సుంది. సుదీర్ఘ కాలం తర్వాత ఆర్‌సీబీ టాప్-2లో నిలిచింది. లీగ్ దశలో అదిరే ప్రదర్శన చేసిన బెంగళూరు.. ఆఖరి మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించిన జోష్‌లో ఉంది. ఓపెనర్లు సాల్ట్, కోహ్లీ దూకుడైనా ఆరంభాన్నిస్తుండగా.. మిడిలార్డర్‌లో తాత్కాలిక కెప్టెన్ జితేశ్ శర్మ ప్రదర్శన కీలకంగా మారింది. గాయపడిన టిమ్ డేవిడ్ సెలెక్షన్‌కు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఇక, హాజెల్‌వుడ్ ఫుల్ ఫిట్‌నెస్ సాధించడంతో బౌలింగ్ బలం పెరిగింది. పేసర్ భువనేశ్వర్ కుమార్‌తోపాటు స్పిన్నర్లు క్రునాల్ పాండ్యా, సుయాష్ శర్మ జట్టుకు ఉపయోగపడుతున్నారు. ఇదే పిచ్‌పై జరిగిన ఓ మ్యాచ్‌లో పంజాబ్‌పై గెలుపొందడం బెంగళూరుకు సానుకూలాంశం. మరోవైపు, సొంతగడ్డపై విజయంతో నేరుగా ఫైనల్ బెర్త్ పట్టేయాలని అయ్యర్ సేన పట్టుదలతో ఉంది.

**జట్లు (అంచనా)**

**పంజాబ్:** ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్, జోష్ ఇంగ్లిస్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహల్ వధేరా, శశాంక్ సింగ్, స్టొయినిస్, ఒమర్జాయ్, హర్‌ప్రీత్ బ్రార్, కైల్ జేమిసన్, అర్ష్‌దీప్ సింగ్, చాహల్ (ఇంపాక్ట్ సబ్)


**బెంగళూరు:** కోహ్లీ, సాల్ట్, మయాంక్ అగర్వాల్, రజత్ పటీదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ (వికెట్ కీపర్), క్రునాల్ పాండ్యా, లివింగ్‌స్టోన్, రొమారియో షెఫర్డ్, భువనేశ్వర్, యష్ దయాళ్, హాజెల్‌వుడ్, సుయాష్ శర్మ(ఇంపాక్ట్ సబ్).





## స్విమ్మింగ్ పూల్‌లో అనసూయ

అందాల ముద్దుగుమ్మ అనసూయ నిత్యం వార్తలలో నిలుస్తుంటుంది. ఈ అమ్మడు ఏం చేసిన అది వార్తనే. ఈ మధ్య అనసూయ కొత్తింటి గృహప్రవేశం చేసింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన విలాసవంతమైన ఇంటిలో అడుగుపెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ తర్వాత వెంటనే కుమారుడి ఉపనయనం వేడుక కూడా జరిపింది. అందుకు సంబంధించిన ఫొటోలని కూడా సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇక ఈ వేడుకలు పూర్తైన వెంటనే ఫ్యామిలీతో కలిసి శ్రీలంకలో వాలింది. సమ్మర్ వెకేషన్‌లో భాగంగా శ్రీలంకకి వెళ్లిన అనసూయ..అక్కడ తమ ఎంజాయ్‌మెంట్‌కి సంబంధించిన ప్రతి విషయాన్ని ఇన్‌స్టా ద్వారా షేర్ చేస్తుంది.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# ఆపరేషన్ సిందూర్‌తో దీటైన జవాబిచ్చాం

యాభయ్యవ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకుంటున్న సిక్కిం ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. వర్చువల్‌గా వారిని ఉద్దేశించి ప్రసంగించారు. సిక్కిం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని రకాలుగా సాయం చేస్తానని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. 'పర్యాటక రంగ ప్రభావం ఎంత గొప్పదో సిక్కిం ప్రజలకు తెలుసు. పర్యాటకం అంటే విభిన్నత్వానికి ప్రతీక. ఇక, పహల్గాం ఘటన భారత్‌పై జరిగిన ఉగ్రదాడి మాత్రమే కాదు. మానవత్వం, సోదరభావంపై జరిగిన దాడి' 'ఎన్నో భారతీయ కుటుంబాల సంతోషాన్ని టెర్రరిస్టులు హరించారు. భారత్‌లో కూడా చీలిక తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే, భారత ఐకమత్యం ఎంత గొప్పదో ప్రపంచం చూసింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశమంతా ఒక్కటై ఉగ్రవాదులకు దీటుగా బదులిచ్చింది. ఉగ్రవాద శిబిరాలు ధ్వంసమవడంతో పాక్ ఆక్రోశంతో మన సైన్యం, పౌరులపై దాడులకు తెగబడింది. దీంతో, పాక్ బండారం బయటపడింది. పాక్ వైమానిక స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేయడం ద్వారా భారత స్పందన ఎంత తీవ్రంగా ఉంటుందో వాళ్లకు చూపించాము' అని ప్రధాని మోదీ అన్నారు.ఈ సందర్భంగా ప్రధాని.. రాష్ట్రంలో పలు అభివృద్ధికారక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. నమ్చీ జిల్లాలో రూ.750 కోట్లతో నిర్మించనున్న 500 పడకల జిల్లా ఆసుపత్రి, సాంగాచోలింగ్‌లోని ప్యాసెంజర్ రోప్‌వే, గాంగ్‌టాక్ జిల్లాలోని అటల్ అమృత్ ఉద్యానవనంలో మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈశాన్య రాష్ట్రాలే కేంద్రంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటీవల ఈశాన్య రాష్ట్రాల ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఢిల్లీలో జరిగిందన్న విషయాన్ని కూడా మోదీ పేర్కొన్నారు. ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. దీంతో, రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని తెలిపారు. వాస్తవానికి ప్రధాని మోదీ సిక్కిం అవతరణ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రాన్ని సందర్శించాల్సి ఉంది. అయితే, వాతావరణం అనుకూలించకపోవడంతో ఆయన పశ్చిమ బెంగాల్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది.



### భారత్‌లో 24 కోట్ల మంది ముస్లింలు

# గర్వంగా ఫీలవుతున్నారు

**అసదుద్దీన్ ఓవైసీ**

ఉగ్రవాదానికి ఊతం ఇస్తున్న పాకిస్థాన్‌ను నిలదీసేందుకు భారత ఎంపీల బృందాలు వివిధ దేశాల్లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సౌదీ అరేబియాకు వెళ్లిన బృందంలో ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ ఉన్నారు. ఆయన అక్కడ మాట్లాడుతూ.. భారత్‌లో 24 కోట్ల మంది ముస్లింలు జీవిస్తున్నారని, ఇది గర్వకారణమన్నారు. భారత్‌లో ఎంతో మంది ఇస్లామిక్ పండితులు ఉన్నట్లు ఆయన చెప్పారు. తామే ముస్లిం దేశస్థులమని అరబ్ ప్రపంచాన్ని పాకిస్థాన్ తప్పుదోవ పట్టిస్తోందని, ఇండియా ముస్లింలకు వ్యతిరేకమన్న సంకేతాన్ని ఆ దేశం ఇస్తున్నదని ఆరోపించారు. ఇండియాలో 24 కోట్ల మంది ముస్లింలు ఉన్నారని, ఇక్కడ ఉన్న ఇస్లామిక్ పండితులు మరెక్కడా లేరన్నారు. అత్యుత్తమైన అరబిక్ భాషను మాట్లాడుతారని చెప్పారు. ముస్లిం దేశం కావడం వల్లే పాకిస్థాన్‌ను ఇండియా వేధిస్తున్నట్లు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని అసదుద్దీన్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ఒకవేళ ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇవ్వడం నిలిపివేస్తే, అప్పుడు దక్షిణాసియాలో స్థిరత్వం వస్తుందన్నారు.



### డొనాల్డ్ ట్రంప్ పాలకవర్గం నుంచి

# వైదొలగిన ఎలాన్ మస్క్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, స్పేస్ ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ మధ్య గ్యాప్ వచ్చింది. నిన్నటిదాకా ఏ విధానాలు నచ్చి ట్రంప్‌పై మస్క్‌కు అభిమానం పెరిగిందో..ఇప్పుడవే ఇద్దరి మధ్య విభేదాలు సృష్టించాయి అయితే ట్రంప్-మస్క్ స్నేహానికి బ్యూటీఫుల్ బిల్ గండికొట్టింది. ఎన్నికల సమయంలో మస్క్.. ట్రంప్ కు సపోర్ట్ చేశారు. కానీ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టాక ఆయన తీసుకుంటున్న నిర్ణయాలపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే డోజ్ నుంచి వైదొలిగిన మస్క్.. ఇప్పుడు ట్రంప్ తీసుకొచ్చిన బిల్లును బహిరంగంగానే వ్యతిరేకించడం చర్చనీయాంశమైంది.ఈ క్రమంలోనే ఎలాన్ మస్క్.. ట్రంప్ యంత్రాంగం నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్స్ చీఫ్‌గా తన పదవీకాలం ముగిసిందని ట్వీట్ చేశారు. 'వృథా ఖర్చులను తగ్గించే అవకాశం ఇచ్చినందుకు' అమెరికా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రకటన చేశారు. డోజ్ మిషన్ కాలక్రమేణా బలపడుతూ ప్రభుత్వ వ్యవస్థలో ఒక జీవిత విధానంగా మారుతుందని మస్క్ అభిప్రాయపడ్డారు. అయితే, ట్రంప్‌పై విమర్శలు చేసిన మర్నాడే ఆయన డోజ్‌కు రాజీనామా చేయడం గమనార్హం. ది వన్ బిగ్ బ్యూటిఫుల్ పేరుతో ట్రంప్ తీసుకొచ్చిన కొత్త పన్ను విధానాన్ని విమర్శించిన మస్క్.. అది బడ్జెట్ లోటును పెంచుతుందని, డోజ్ బృందం చేసిన కృషిని అడ్డుకుంటుందన్నారు.. ఒక బిల్లు పెద్దగా ఉండవచ్చు, అందంగా ఉండవచ్చు. కానీ రెండూ కలిసుండటం కష్టమన్నారు మస్క్. ఎలాన్ మస్క్ వ్యాఖ్యలపై ట్రంప్ ఓవల్ ఆఫీసులో స్పందిస్తూ.. ఈ బిల్లులో తనకి నచ్చని అంశాలున్నాయి. అయితే, కొన్ని అంశాలు మాత్రం నాకు చాలా ఇష్టం అని చెప్పారు. ఇంకా కొన్ని మార్పులు చేసే అవకాశం ఉందని కూడా ఆయన సూచించారు. అలాగే రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలంటూ ట్రంప్ పేర్కొన్నారు.

### తెలంగాణ నయాగరా.. బొగత వాటర్ ఫాల్స్‌కు

# పోటెత్తిన పర్యాటకులు



తెలంగాణ నయాగరా బోగత జలపాతాలలో తొలకరి వరద నీరు జాలువారుతుంది.. 50 అడుగులు ఎత్తునుండి పాలధారలా జాలువరుతున్న జలపాతాలను వీక్షించేందుకు జనం పరుగులు పెడుతున్నారు..జలపాతాలలో జలకాలాడుతూ తనివితీరా ఎంజాయ్ చేస్తున్నారు. ఎండలు మండిపడే రోహిణి కార్తెలోనే రుతు పవనాల రాకతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి.. మే నెలలో బోసిపోయి కనిపించే జలపాతాలకు జలకళ సంతరించుకుంది_ _ _ ఎగువ ప్రాంతాల్లోని చెత్తిస్ గడ్ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో బొగత జలపాతాలకు జలకళ సంతరించుకుంది..ములుగు జిల్లా వాజేడు మండలం చేకుపల్లి సమీపం లోని బోగత జలపాతాలు ప్రస్తుతం చూడడానికి కన్నుల విందుగా కనిపిస్తున్నాయి.. ఎంత దూరం ప్రయాణం చేసినా ఈ జలపాతాలు కంటపడితే చాలు ఆ అలసట మరిచిపోయి తన్మయత్వంతో ఉప్పొంగిపోయేలా చేస్తున్నాయి.. బోగత జలపాతాలు సందర్శనకు వచ్చే జనం తినివితీరా ఎంజాయ్ చేస్తున్నారు.



# కిల్లింగ్ లుక్స్‌తో మెరిసిపోతుందిగా..

సారా అలీ ఖాన్ కేధర్‌నాథ్ సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. సారా అలీ ఖాన్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఫొటోలను అప్‌లోడ్ చేస్తుంటుంది. తాజాగా బ్లాక్ డ్రెస్‌లో ఉండే ఫొటోలను షేర్ చేయగా నెట్టింట అవి వైరల్ అవుతున్నాయి.గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన సారా అలీ ఖాన్ కేదార్‌నాథ్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది.సారా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తాజా ఫొటోలను షేర్ చేస్తుంది.తాజాగా బ్లాక్ డ్రెస్‌లో ఉండే ఫొటోలను షేర్ చేయగా నెట్టింట అవి వైరల్ అవుతున్నాయి.సారా అలీ ఖాన్ ఒక చాట్ షోలో తాను తినడానికి చాలా ఇష్టపడతానని, దాని వల్ల బరువు పెరిగి పిసిఓడి (పాలిసిస్టిక్ ఓవరీయన్ డిసీజ్) సమస్య వచ్చిందని వెల్లడించారు.బరువు పెరిగిన తర్వాత తన జీవనశైలిని మార్చుకున్నానని సారా అలీ ఖాన్ చెప్పారు. ఆమె డైట్‌తో పాటు వ్యాయామం కూడా ప్రారంభించారు.



### దాని కోసం నేను

# పెద్ద త్యాగమే చేశాను..

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయింది. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ ముద్దుగుమ్మ వరుస సినిమాలతో బిజీగా అయ్యింది. తక్కువ సమయంలోనే ఈ చిన్నది స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఆతర్వాత పాన్ ఇండియా సినిమాలు చేస్తూ ఫుల్ ఫేమస్ అయ్యింది. నటి రష్మిక మందన అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' చిత్రంతో పాన్ ఇండియా హిట్ అందుకుంది.రీసెంట్ గా విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది ఈ సినిమా. ఇక ఇప్పుడు రష్మిక రష్మిక మంధాన లక్ష్మణ్ ఉదేకర్ దర్శకత్వంలో చావా అనే హిందీ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఛత్రపతి శివాజీ-సాయిబాయి దంపతుల పెద్ద కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజు జీవితం చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. ఛత్రపతి శంభాజీ పాత్రలో విక్కీ కౌశల్ నటిస్తుండగా, శంభాజీ భార్య పాత్రలో నటి రష్మిక మందన్న నటిస్తుంది. ఈ నేపథ్యంలో నటి రష్మిక క్యారెక్టర్ పోస్టర్ ఇంటర్నెట్‌లో విడుదలై వైరల్ అవుతోంది. రష్మిక 5 ఏప్రిల్ 1996న కర్ణాటకలో జన్మించింది. 2016లో రష్మిక 'కిరాక్ పార్టీ' చిత్రంతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రం విడుదలైన సంవత్సరంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.